# అగాధాలు

-మారసాని విజయ్‌బాబు



క్షణకాలం.....హృదయ విదారకమైన చూపొకటి అంతరాళం లో గుచ్చుకుంది. నేను విలవిల లాడిపోయాను. ఆపాదమస్తకమూ వణికిపోయాను. నన్ను నేను కంట్రోల్ చేసుకోవడానికి కొంత సేపు పట్టింది. గిరుక్కున వెనుతిరిగి చూశాను. స్కూటర్ పై కూర్చుని వెళుతున్న ఆమె అప్పటికే చాలాదూరం వెళ్ళిపోయింది. అయినా ఆ కళ్లను జీవితంలో ఎప్పటికీ మరచి పోలేను. అవి నా మనసులో చెరగని ముద్రవేశాయి. అవి గుర్తొచ్చే కొద్ది భయంతో కంపించిపోతూ ఉంటాను.

ఆకళ్లు.....

క్రూరంగా, కుటిలంగా, కఠోరమైన పాషాణంలా ఉన్నాయి.

ఆ కళ్లలో....

ప్రేతకళ, శాడిస్టు మెంటాలిటీ అంతర్లీనంగా. నిక్షిప్తమై ఉన్నాయి.

ఆ కళ్లు....

సైకిక్‌కి సింబాలిక్‌గా ఉన్నాయి.

వారం రోజుల తర్వాత.....ఆఫీసుకు వెళ్లేందుకు బస్సెక్కాను. సీటు దొరకలేదు. కొంచెం ముందుకెళ్లి సర్దుకుని నిలబడ్డాను. కొంతసేపటికే కాళ్లు పీకుతున్నాయి. కూర్చుంటే బాగుణ్ణనిపించింది. ఈ హైదరాబాద్‌లో ఏదైనా దొరుకుతుంది కానీ సిటీబస్సులో సీటు దొరకడం గగనం. ఇంకెన్నాళ్లులే....మహా అంటే రెండేళ్లు. ఆపై రిటైరుమెంటు. ప్రశాంతమైన జీవితం. నాలోనేనే చిన్నగా నవ్వుకున్నాను. ఈ విషయాన్ని తలుచుకొని రోజంటూ ఉందా..........

ఇంతలో తదేకంగా బస్సులోంచి వెలుపలికి చూస్తున్న ఓ నడివయస్సు స్త్రీ నా దృష్టిని ఆకర్షించింది. అమె దేనిని అంతశ్రద్ధగా, తీవ్రంగా చూస్తోందో తెలుసుకోవాలనిపించింది. అయితే ఎంతసేపు ప్రయత్నించినా లాభం లేక పోయింది. బస్సులో రద్దీ ఎక్కువవుతోంది. జనం ఒకర్నొకరు తోసుకుంటూ అసహనం ప్రదర్శిస్తున్నారు. అయినా ఆమెకు ఇవేమి పట్టినట్టులేదు. అరగంటనుంచి చూస్తున్న నాకు కొంత స్ఫురించింది. ఆమెకళ్లు నిర్లిప్తంగా విచారంగా ఉన్నాయి. వాటిముందు ఎన్నో దృశ్యాలు కదులుతున్నాయి. అయితే ఆమె వాటిని గ్రహించడం లేదు.

నేను దిగాల్సిన స్టాపు దగ్గరపడింది. దిగుదామనుకుంటుండగా.....ఆమె లేచి ముందుకు రాసాగింది. నేను అలాగే నిల్చుని ఆమెకు దారిచ్చాను. అప్పుడు గుర్తొచ్చింది.

వారం రోజుల కిందట నేచూసింది ఆకళ్లనే. మళ్లీ నేనెంతగా భయపడి పోయానో వివరించలేను. ఉన్నట్లుండి కరెంట్‌షాక్ తగిలినట్లు ఉలికిపడ్డాను. జ్ఞాపకాల పొరలు విచ్చుకున్నాయి. ఆమె సుమతికాదు కదా! సందేహం ఎంతోసేపు నిలువలేదు. అవును, ఆమె సుమతే.....

ఒకప్పటి నా ప్రేయసి. అప్పటికే ఆమె దిగేసింది. నేను జనాన్ని తోసుకుంటూ హడావిడిగా దగ్గరకెళ్లి.....

"సుమతీ" అని అదుర్గాగా పిలిచాను.

ఆమె ఆశ్చర్యపోయింది. సంకోచంతో నన్నో పరదేశిలా చూసింది. నాముఖంపై ముసురుకుంటున్న ముడుతల్నీ.....వాటిమధ్య తాను పారేసుకున్న అనుభవాలేమిటో నని వెతుకుతోంది.

"నేను రఘురామ్...." పెదాలు దాకా వచ్చిన "య్య" అక్షరం తిరిగి అదే వేగంతో వెనక్కువెళ్లి పోయింది. 'రఘురామ్' మన సులో కదిలింది.

"నీరఘుని" చివరికి చెప్పగలిగాను.

"మీరా!" వింతగా నా వైపు చూస్తోంది.

ఆమె ఏదైనా మాట్లాడుతుందేమోనని ఎదురు చూశాను. ప్రయోజనం లేకపోయింది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక.....

"నువ్విక్కడ" అనుమానంతో అడిగాను. మరేం మాట్లాడాలో తెలియక.

"మాఅక్క కొడుకు బ్యాంకు మేనేజర్. ఇక్కడే పనిచేస్తున్నాడు. అతని భార్య నిన్ననే ప్రసవించింది. ఆసరాగా ఎవరూ లేకపోవ డంతో నేను రావల్సివచ్చింది. రఘూ! నేనొచ్చి చాలా సేపయింది. ఆస్పత్రికి వెళ్లాలి. అక్కడ ఎవరూలేరు."

నాకు చాలా అసంతృప్తి కలిగింది.

"మళ్లీ ఎప్పుడు కలుద్దాం"


"కుదరక పోవచ్చు. నేను వారం రోజుల్లో ఊరెళుతున్నాను."

"నీతో మాట్లాడాలనిపిస్తోంది."

"అయితే ఫోన్ చేయండి" నెంబరిచ్చి వెళ్లిపోయింది.

నాకు ఆఫీసుకు వెళ్లాలనిపించలేదు. ఒకప్పుడు అందంగా, ఆకర్షణీయంగా భమక్‌మంటూ మెరిసిన ఆకళ్లు ఇప్పుడెందుకిలా నిస్తేజం అయ్యాయి. ఆమె మాటల్లో నిరాశా, నిర్లిప్తతా ఎందుకింతగా పొంగి పొర్లాయి. నా హృదయం దహించుకు పోతోంది.

రెండుమూడు రోజులనుంచి సుమతితో




మాట్లాడాలని చేస్తున్న ప్రయత్నాలన్నీ వృథాఅయ్యాయి. అటువైపు ఫోన్ రింగవుతుందేకానీ ఎవరూ ఎత్తడంలేదు. ఈరోజు మళ్లీ ప్రయత్నించగా....సుమతి లైన్లోకి వచ్చింది.

పదిరోజుల కిందట సుమతిని చూసిన ప్పుడు భయపడి పోయిన విషయాన్ని చెప్పాల నుకు న్నాను. క్షణం తర్వాత చెప్పాలనిపిం చలేదు.

"సుమతీ నిన్నిలా చూస్తాననుకోలేదు. నా అంతరంగంలో ఉన్న సుమతికీ నీకు పోలికలు అసల్లేవు. చాలా రోజుల తర్వాత నిన్ను చూశానన్న ఆనందం కూడా కలగడం లేదు.'

' అవతలి వైపు నుంచి మౌనం.

"సుమతీ....నీ ఉత్సాహం, ఆనందం అన్నీ ఏమయ్యాయి."

"రఘూ నాగురించి ఎందుకంత చింతి స్తావు. నేనేమని చెప్పగలను. నా పెళ్ళయిన కొన్నాళ్ళకే నా ఆనందం మూర్తిగా నశించిపోయింది. నా స్వప్నాలూ, చిత్రాలూ, ప్రతిబింబాలూ, కోరికలూ, ఆవేదనా, కోపమూ, ఆలోచనలూ వ్యక్తం చేయడానికి వీలు కలుగలేదు. నేను నాకోసం కాకుండా ఇతరుల కోసం జీవించాల్సి వచ్చింది.

పెళ్ళయిన కొత్తలో నాభర్త నన్ను బాగా చూసుకునే వాడు. రాన్రాను అతనిలో ఏదో తెలియని అసహనం, అనుమానం చోటు చేసుకున్నాయి. చీటికీ, మాటికీ అనవసరంగా నన్ను కొట్టేవాడు. ఇల్లుదాటనిచ్చేవాడు కాదు. ఆ ఇల్లే నా పాలిట జైలయింది. మొదట్లో ఆయన నన్ను కొట్టేటప్పుడు నేను భీతిల్లపోయే దానిని... ఏడ్చేదానిని...ఆ తర్వాత నా కళ్ళల్లో నీళ్లు రావడం కూడా మానేశాయి. మౌనంగానే దెబ్బలు తింటున్న నన్ను చూసి ఆయన ఇంకా రెచ్చిపోయేవాడు. తర్వాత కొన్నాళ్ళకు కొట్టడం మానేశాడు. మా ఇద్దరిమధ్య మాటలు కూడా కరువయ్యాయి. అవసరమైనప్పుడు ఒకటీ రెండు మాటలు, పొడిగా.......అంతే. నా దురదృష్టానికి బిడ్డలు కూడా పుట్టలేదు. పుట్టి ఉంటే వాళ్లతో నైనా నాలోని బాధ, కోపమూ, ద్వేషమూ అన్నీ చెప్పుకునేందుకు అవకాశం ఉండేదేమో? భావ ప్రసారానికి ఇంకెలాంటి ఛానల్స్ లేక అవన్నీ నాలో నిక్షిప్తమై పోయాయి. అప్పుడప్పుడూ స్టీలు గిన్నెలతో, అద్దాలతో, గోడలతో మాట్లాడాలని పిస్తోంది. చాలాసార్లు మాట్లాడాను కూడా......అయినా వాటినుంచి జవాబు లేదు. నా కిష్టమైన మాటలే వాటినుంచి వినాలనే కోరిక కూడా లేదు. కనీసం ఓ తిట్టూ, నన్ను ద్వేషిస్తూ.......నాకు నచ్చని ఓ మాట అయినా సరే వినాలని పిస్తోంది. ఇంకేం చెప్పను. పొద్దున్నే ఊరెళు తున్నాను.

ఎవరితోనైనా దేనితోనైనా మాట్లాడాలని తపించే నాకు ఈ రోజు మీతో మాట్లాడుతుంటే చాలా ఇబ్బందిగా ఉంది. కారణమేమో తెలియదు. నా మనసులో మాట చెప్పనా.....ప్లీజ్ దయచేసి ఫోన్ పెట్టేయండి. వెంటనే ఆమె క్రెడిల్ చేసిన చప్పుడు వినిపించింది.

ఆమె మాటలకు చలించిపోయాను. తల పగిలి పోతుందేమోనని సందేహం కలిగింది. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

ఆ కళ్లలో ఓ జీవిత రహస్యం ఉంది.

అవి ప్రపంచాన్ని ద్వేషిస్తున్నాయి.

మేమిద్దరం దంపతులమై ఉంటే......ఆమె ఇలా అయి ఉండేదికాదు. పువ్వుల్లో పెట్టి చూసుకుని ఉండేవాడిని.....మాస్వప్నాలను ధ్వంసం చేసిన తల్లిదండ్రులపైన విపరీతమైన కోపం కలిగింది.

కొన్నాళ్లు గడచిపోయాయి. ఓ రోజు యధాలాపంగా నా భార్యకేసి చూసి నిశ్చేష్టుడై

అలాగే కొంతసేపు ఉండిపోయాను.

ఆమె కళ్లు కూడా ప్రపంచాన్ని ద్వేషిస్తున్నాయి.

నాతల తిరిగిపోతోంది.....

మాపెళ్లి పెద్దలు కుదిర్చిందే అయినప్పటికీ ఆమె మనసును నేనెన్నడు బాధపెట్టలేదు. అయితే ఆమె అసంతృప్తికి కారణమేమిటి?

......

ఆరాత్రి పడుకున్నా నన్న మాటేకానీ నిద్రపట్టలేదు. ఆమె నా జీవితంలోకి ప్రవేశించిన రోజు గుర్తొచ్చింది.

పాలగ్లాసుతో అడుగుపెట్టిన సీతమ్మ ముఖంలో కొత్తదనం, భయం, బెరకు, అమాయకత్వం, సిగ్గు, సంబరం అన్నీ సమ్మిళితమై పోయి వింతశోభ, అకర్షణీయంగా ఉట్టిపడుతోంది.

"రా.......కూర్చో" నవ్వుతూ మంచంపైకి ఆహ్వానించాను.

ఆమె మౌనంగా వచ్చి కూర్చుంది.

"నిన్నందరూ సీతమ్మ అనే పిలుస్తారా?'

' తలను పైకీ కిందకీ ఆడించింది. సిగ్గులు తొణికిసలాడుతూ ఆమె ముఖం ఎర్రబడుతోంది......

"ఆ పేరు నాకు నచ్చలేదు"

సీతమ్మ మొఖం వివర్ణమైంది

దానిని నేను అంతగా పట్టించుకోకుండా

"సీతాలు" అని పిలుచుకోనా!

"అలాగే మీ ఇష్టం"

అటు తర్వాత మాదాంపత్య జీవితంలో ఆమాట కొన్ని వేలసార్లు పునరావృత్తం అయింది. దాని ప్రకంపనాలు నాచెవిలో హోరుమని మారుమ్రోగాయి.... ఆశబ్దానికి జ్ఞాపకాలు విచ్ఛిన్నమైయ్యాయి.

మొదటిరోజే మాఇద్దరి మధ్య కన్పించని సున్నితమైన పొర ఏర్పడిందేమో! అది అనంతమై సహస్ర యోజనాల దూరానికి మా ఇద్దర్ని విభిన్న దిశలవైపు నెట్టేసిందా! మరో వైపు ఇది నిజం కాదేమోననిపిస్తోంది. సందిగ్ధంలో పడిపోయాను. సీతాలు నడిగితే సరిపోతుంది కదా! అనిపించింది. అవును అదే సరైన నిర్ణయం. నేనెంత ఆలోచించినా ... అది కేవలం ఓ వైపు నుంచి మాత్రమే అవుతుంది. ఇలా అనుకోగానే మనసు తేలికపడింది. నిద్ర లేపి ఆమెను అడగాలనిపించిందే కానీ ఆపని చెయ్యలేక పోయాను. ఒక్కసారిగా అనుమానపు మేఘాలు కమ్ముకున్నాయి. ఈ విషయాల్ని ఆమెదగ్గర చెప్పుకునేంత చనువు లేదేమో! ననిపించింది. ఇన్నాళ్ల దాంపత్య జీవితంలో మాఇద్దరి మధ్య సన్నిహితం కూడా లేదా! కేవలం భ్రమల్లోనే జీవించామా! వెను వెంటనే ఈ అనుమానం శాఖోపశాఖలుగా చీలిపోయింది.

రోజులు గడుస్తున్నాయి.... నాలోని సందేహాల్ని నివృత్తి చేసుకోవాలనే కోరిక తీవ్రమవుతోంది. దేన్నయినా ఇలా ఒంటరిగా పరిశీలించడం ద్వారా స్పష్టత ఏర్పడదనిపిస్తోంది. పోల్చి చూడడానికి మరొకటి కావాలనిపిస్తోంది.

నా పరిశీలనంతా వివాహ వ్యవస్థ మీదే కేంద్రీకరించింది. దీనికి సంబంధించిన పుస్తకాలు చదవడం ప్రారంభించాను. ఇప్పుడున్నటువంటి వివాహ వ్యవస్థ స్త్రీ స్వేచ్ఛను పూర్తిగా హరిస్తోంది.

మరి పురుషుడూ! ... ఈ వ్యవస్థ స్త్రీనేకాదు పురుషునీ బందీ చేస్తోంది. పెళ్లి అయిన వెంటనే పిల్లలు పుట్టుకొస్తారు. వాళ్లను పోషించడానికి రాత్రింబవళ్లు చాకిరీ చెయ్యాలి. తిండికోసం, పిల్లల పోషణకోసం, ఇంటిఅద్దెకోసం .... మొత్తం బతుకంతా యాతనలో పడి కొట్టుకుపోతుంది. అయినప్పటికీ పురుషునికి బాహ్య ప్రపంచం విస్తారంగా ఉండటంతో చాలా వరకు నయంగా కన్పిస్తాడు. అతనిలో ఏర్పడే కోపం, కసి, అనహ్యాలను వెళ్లగక్కెందుకు అనేక మార్గాలున్నాయి. ఏ మార్గం దొరకని వ్యక్తి, నోరెత్తి మాట్లాడలేని నిసహాయస్థితిలో ఉన్న భార్యపైన వెళ్లగక్కేస్తాడు. చివరికామె డెడ్ ఎండ్‌గా మిగిలి పోతోంది. ఇలాంటి స్థితిలో ఉన్న స్త్రీ ప్రపంచాన్ని మౌనంగా ద్వేషిస్తోందా?... అంతే ...

నా ఎదురుగా ప్రపంచాన్ని ద్వేషిస్తున్న వేన వేల కళ్లు గుమికూడాయి. ఆ చూపులు నా కిప్పుడు బాగా అర్థం అవుతున్నాయి.

అంతేకాదు ...

అవి శతాబ్దాల నాటి పాత చూపులు

బహూశా మరెన్నో శతాబ్దాల దాకా ఉండవచ్చు.... ●

## తల్లి పాత్రలో మూన్‌మూన్ సేన్



విశాలనయనాలు, కోటేరు లాంటి నాసిక, బంగారు మేని ఛాయ, వెన్నెలను మరిపించే మందహాసం - ఇవన్నీ కలబోసిన రూపం మూన్ మూన్ సేన్‌ది. నవనవోన్మేషమైన అందం ఆమెది.

ఇప్పుడు ఈ అందాల భరిణె టి. వీ. సీరియల్స్‌లో తల్లి పాత్రలు పోషిస్తోంది. సదానవ యవ్వనంతో తొణికిసలాడుతున్నట్టు కన్పించాలని ప్రయత్నించే మూన్ మూన్ సేన్ తల్లి ప్రాతల్లో నటించడానికి సిద్ధపడిందన్న వార్త కొంచెం సంచలనం రేపింది. త్వరలో ప్రసారం కానున్న ఓ సీరియల్‌లో రాఖీ విజయన్‌కు తల్లిగా మూన్‌మూన్ సేన్ నటిస్తోంది.

మూన్‌మూన్‌ది తెలివైన నిర్ణయమే అని పలువురు ప్రశంసిస్తున్నారు. స్టీరియోటైప్ తల్లులను చూస్తున్న ప్రేక్షకులకు మూన్‌మూన్‌సేన్ తల్లిపాత్రలో కన్పించడం నిజంగా వెన్నెలంత హాయి.

☆☆☆